క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

సాలూరు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 216 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా ఆన్‌రోల్‌కు 50 మంది, అప్రెంటీస్‌కు 30 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనుల పరిశీలన



నిర్మాణ పనులపై ఆరాతీస్తున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిర్మిస్తున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆరా తీసి, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సిబ్బందిని పీవో ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఏపీవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా నాగభూషణరావు



పార్వతీపురంటౌన్: డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ జి.నాగభూషణరావును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఇక్కడి డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.వాగ్దేవి స్వయంగా విధుల నుంచి తప్పుకోవడంతో ఆ స్థానంలో నాగభూషణరావు వచ్చారు. గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఉందని, జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తారని అందరూ ఆశిస్తున్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు



రంగంపేట సమీపంలో రోడ్డుపై పడి ఉన్న విద్యుత్ వైర్లు

సీతానగరం: ఈదురుగాలుల ధాటికి మండలంలోని పణుకుపేట-రంగంపేటల మధ్య బీటీ రోడ్డుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. బుధవారం సాయంత్రం వీచిన గాలుల ప్రభావానికి అక్కడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కరెంట్ సరఫరా లేని సమయంలో అవి పడడం, అదే సమయంలో రోడ్డు మీదుగా ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఇదే విషయంపై సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి సిబ్బందితో చేరుకుని, వైర్లు బిగించే పనులు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

సేంద్రియం..నేలకు బలం!

- సేంద్రియ ఎరువులతో నేలతల్లికి మేలు
- పశువుల గెత్తం, గొర్రెల కొట్టంతో భూసారం
- వేసవి దుక్కులకు ముందే వేసుకోవాలి
- ఫలితంగా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు



పొలాల్లో వేసేందుకు తరలిస్తున్న గెత్తం

బలిజిపేట: పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నేల సారవంతమై నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పశువుల గెత్తం, గొర్రెలు, మేకల కొట్టం(వ్యర్థాలు)తో భూసారం పెరుగుతుందని, చెరువు మట్టితోనూ నేలకు మంచి పోషకాలు అందుతాయని సలహా ఇస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ముందు ఈ సహజ ఎరువులు వేసుకుంటే పంట ఏపుగా పెరిగి, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యంతో పంట నిలబడగలదని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ఘన, ద్రవ జీవామృతాలతో మేలు..

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంటలకు వాడే ఘన, ద్రవ జీవామృతాలతో మేలు. మన పరిసరాల్లో లభ్యమయ్యే ఆవుపేడ, మూత్రం, వివిధ ఆకులు వంటి వాటితో తయారయ్యే ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయి. భూసారానికి, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు ఆఖరి దుక్కులో ఘనజీవామృతం వినియోగించడం, పంటలలో వివిధ దశలలో ద్రవజీవామృతం వినియోగించడం, పంటలలో విత్తనం ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం, మరికొన్ని పంటలలో వచ్చే తెగుళ్ల, చీడపీడల నివారణకు రసాయన రహిత యాజమాన్య పద్ధతులు పాటించడం వంటి వాటిపై వ్యవసాయ శాఖ నిత్యం రైతులకు అవగాహన కలిస్తోంది. అలాగే వరి సాగులో అధిక దిగుబడులకు లైన్ సోయింగ్ పద్ధతిని రైతులకు వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

కర్షణ శాతం పెరుగుతుంది..

ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సంప్రదాయ వ్యవసాయాన్ని కొనసాగించడంపై దృష్టిసారిస్తున్నారు. దీనికి వ్యవసాయ శాఖ కూడా ప్రోత్సహిస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించేలా వారికి ప్రణాళికాబద్ధంగా సాగు విధానాలను వివరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభ్యమయ్యే పశువుల గెత్తం(పేడ), గొర్రెలు, మేకలు గొట్టం, చెరువులు, నీటికుంటల్లోని నల్లరేగడి మట్టి పొలాల్లో వేస్తే నేల సారవంతమవుతుంది. తద్వారా కర్షన శాతం పెరిగి మొక్కల వేర్లు సులువుగా నేలలోకి చొచ్చుకుపోయి సకాలంలో ఏపుగా పెరిగేలా దోహదపడుతుంది. రానురాను రసాయనిక ఎరువుల వినియోగం పెరగడం, వాటి ధరలు కూడా భారీగా ఉండడంతో తక్కువ ధరలకు లభ్యమయ్యే ప్రకృతి సిద్ధమైన సహజ ఎరువుల వినియోగానికి రైతులు ముందుకు వస్తున్నారు.

సేంద్రియ ఎరువులు మేలు..

రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. నేల సారవంతమై మొక్కలకు అవసరమైన పోషకాలు అందుతాయి. తద్వారా ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయి. పొలాలకు గెత్తం తరలిస్తే నేలకు సేంద్రియ బలం చేకూరుతుంది. రసాయనిక ఎరువుల కన్నా సేంద్రియ ఎరువులే మేలు. మంచి ఫలితాలు ఇస్తాయి.

– ఎం.శ్రావణ్‌కుమార్, ఏవో, బలిజిపేట

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



పెద పెంకిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సులేఖ

బలిజిపేట: కిశోర బాలికలంతా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఐసీడీస్ పీవో సులేఖ సూచించారు. మండలంలోని పెదపెంకి, బలిజిపేట ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కిశోర వికాసంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిశోర దశలో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని, రుతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మెరుగైన ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం లింగ వివక్ష, బాల్యవివాహాలు, బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా, గృహహింస, పని ప్రదేశంలో మహిళలు పడుతున్న వేధింపులు, ఆత్మసంరక్షణ, ఆరోగ్యం, బాలికా విద్య ఆవశ్యకత, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల లీగల్ ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్, ఓఆర్‌డబ్ల్యూ ఆర్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'దారి'ద్ర్యం..



పార్వతీపురం మండలం, వెంకంపేట గోలీల జంక్షన్ నుంచి ఎమ్మార్‌నగర్ దగ్గర ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. ఒడిశాలోని కొరాపుట్ వరకు వెళ్లే ఈ దారి అంతా అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి ఉంది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారంలోకి రాగానే సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు వేసి చూపిస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం కాదు కదా వాటి మరమ్మతుల విషయం కూడా మరిచింది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడే ధ్వంసమైన రోడ్లు, గోతులమయమైన రోడ్లు కనిపిస్తున్నాయి. మంగళవారం ఎమ్మార్ నగర్ వద్ద మరమ్మతులకు గురైన రోడ్డును పలువురు కాంగ్రెస్ నాయకులు పరిశీలించి, రోడ్డు బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

– పార్వతీపురం రూరల్

బయోమెట్రిక్ పరికరాలు అందజేత



పరికరాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురంటౌన్: స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలను సిబ్బందికి మంగళవారం అందజేశారు. సకాలంలో ఆరోగ్య సర్వే లక్ష్యాలు చేరుకోవడంలో ఈ పరికరాలు దోహదపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు కోరారు. ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బంది పలు సర్వేలు చేయడం జరుగుతోందని, ఇందుకు గాను జిల్లాకు 695 బయోమెట్రిక్ పరికరాలు పంపిణీ చేశామని, వాటిని అన్నీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యం తనిఖీ చేసి, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్‌మోహన్‌రావు, పీఎల్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతి

సీతానగరం: మండలంలోని రెండు గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తూ మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. కాశీపేట డిజిటల్ అసిస్టెంట్ రెడ్డి మాహేశ్వరరావుకు బలిజిపేట మండలం, శివరాంపురం పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శిగా నియమించారు. గాదెలవలస డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాంగల గణేష్‌ను బొబ్బిలి మండలం, జె.రంగరాయపురం పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

రేగిడి: మండలంలోని వండానపేట, కె.ఎం.వలస, ఉంగరాడమెట్ట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లోని రికార్డులు, పౌష్టికాహార నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. బరువు తక్కువ పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు.

పక్కాగా 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'



కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వచ్చే మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఇదే విషయమై మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆయన.. శనివారం చేపట్టే కార్యక్రమంలో వేసవి వడగాడ్పుల వల్ల అనారోగ్యం బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'బీట్ ద హీట్' థీమ్‌తో ప్రజలు వేసవి ఎండల బారినపడకుండా చూడాలన్నారు. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని, మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

ఘనంగా నూకాలమ్మ సంబరాలు



పూజలందుకుంటున్న నూకాలమ్మ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పాచిపెంట: గ్రామదేవత నూకాలమ్మ సంబరాలు మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ ఉత్సవాలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కూడా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పండగ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు.

కిశోరీ బాలికలకు అవగాహన



బొబ్బిలిరూరల్: కలవరాయిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కలవరాయి గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో కిశోరీబాలికలకు ఐసీడీఎస్ పీఓ జాగాన విజయలక్ష్మి హక్కులు, పోక్సో, రక్షణ చట్టాలు, తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ, వారి ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధా న్యం ఇస్తోందన్నారు. రక్తహీనత బారినపడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజు, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

వంగర: కిశోరీ బాలికలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజినీదుర్గ అన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా శివ్వాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు బాలల హక్కులు, పోక్సో చట్టం, రుతు క్రమం సమయంలో పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లు పి.భారతి, దమయంతి, ఏఎన్ఎం శ్యామల పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా ఖాళీ స్థలాలు



ఎమ్మార్‌నగర్ శివారులో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు



పెదబొండపల్లి ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోయిన కాలువ



పుట్టూరు గ్రామ రోడ్డు పక్కన చెత్తాచెదారం

పార్వతీపురం మండలంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని ఊరి శివారు ప్రాంతాలకు తరలించి, పారబోస్తున్నారు. మండల కేంద్రం సహా పలు గ్రామాల్లో విచ్చలవిడిగా చెత్తకుప్పలు ఎక్కడపడితే అక్కడ వేయడంతో అవి దోమలు, ఈగలకు నిలయాలుగా మారి రోగాలను కలుగజేస్తున్నాయి. దుర్గంధం కూడా విపరీతంగా వెదజల్లుతుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని, వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై పార్వతీపురం జిల్లా పంచాయతీ అధికారి కొండలరావును సంప్రదించగా, రెండు మూడు రోజుల్లో చెత్తకుప్పలు తరలించి, తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తామన్నారు.

– పార్వతీపురం రూరల్



వైకేఎం కాలనీ వద్ద అంతర్‌రాష్ట్ర రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేసిన దృశ్యం

ఘనంగా పైడితల్లి సిరిమానోత్సవం



బొబ్బిలిరూరల్: కమ్మవలసలో సిరిమానోత్సవం



బాడంగి: వాడాడలో పైడితల్లి సిరిమాను తిరువీధి



బాడంగి: సిరిమానుకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రాజాం సిటీ: కొారిపురంలో సిరిమాను ఊరేగింపు

బొబ్బిలిరూరల్: మండలంలోని కమ్మవలస గ్రామ దేవత పైడితల్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు మేళతాళాల మధ్య పూజారి తమ్మిరెడ్డి శంకర్ సిరిమానును అధిరోహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సిరిమానును ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, సర్పంచ్ పిల్లా వసుంధర, గ్రామ ప్రజలు అమ్మవారికి, సిరిమానుకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వాడాడలో...

బాడంగి: వాడాడలో మంగళవారం నిర్వహించిన గ్రామదేవత పైడితల్లమ్మ సిరిమానోత్సవం అంబరాన్నంటింది. పూజారి గొట్టాపు సత్యం సాయంత్రం 4 గంటలకు సిరిమానును అధిరోహించారు. పెద్దవీధిలో అమ్మవారి గద్దెవద్ద ప్రారంభమైన సిరిమాను ఊరేగింపు, ఘటాల తిరువీధి రాత్రి వరకు కొనసాగింది. సిరిమాను తిప్పడానికి సిద్ధమైన సమయంలో ఈదురుగాలులతో వర్షం కురవడంతో అర్ధగంట పాటు ఊరేగింపునకు అంతరాయం కలిగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై పైడితల్లి అమ్మవారిని, సిరిమానును దర్శించుకుని పూజాలుచేశారు. సిరిమానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొఠారిపురంలో...

రాజాం సిటీ: మండల పరిధి కొఠారిపురం గ్రామంలో అసిరితల్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.మహిళలు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

'పల్లె పండగ' పనుల బిల్లులు ఎప్పుడిస్తారు..?

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం 'పల్లెపండగ' పేరుతో హడావుడి చేసి పంచాయతీల్లో పనులు చేయించిందని, ఆ బిల్లులు ఎప్పుడిస్తారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఉపాధి హామీ, పశుసంవర్థక, గ్రామ పంచా యతీ, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్‌శాఖల పద్దులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోతే ఎలా అంటూ పంచాయతీ రాజ్ అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వం మార్చి నెలలోనే పెండింగ్ బకాయిలను విడుదల చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హడావుడే తప్ప చేసిందేమీలేదని దుయ్యబట్టారు. అప్పులుచేసి పనులు చేయించి నష్టపోతున్నామని, సంబంధిత బిల్లులు ఇంత వరకు విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. అలాగే నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్‌శాఖాధికారులు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.పంచాయతీలకు పెండింగ్ నిధులను విడుదల చేయాలని సూచించారు. అంతకు ముందు ఇటీవల మృతిచెందిన మాజీ జెడ్పీ చైర్మన్ పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.